క్లుప్తంగా

ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నూతన పాలకవర్గం

రామచంద్రపురం: పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో చైర్మన్‌గా సలాది వెంటప్పనాయుడు(నాయుడు మాస్టారు), సభ్యులుగా మార్ని సుబ్బారావు, కొండపల్లి చిరంజీవి రవికుమార్, బాలాంత్రపు లక్ష్మీ సరస్వతి, శిరిగినీడి దుర్గాప్రసాదరావు, అంపోలు వరలక్ష్మి, నరాల సురేష్, బండి సత్యవాణి, ముచ్చుమిల్లి సుజాతలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్ బాలాజీ రామ్‌ప్రసాద్, పలువురు నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి ఎగ్ కార్ట్ పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ సెర్ప్ ద్వారా ఉచితంగా సమకూర్చిన రూ.50 వేలు విలువైన ఎగ్ కార్ట్‌ను సోమవారం లబ్ధిదారుడికి అందజేశారు. జెడ్. మేడపాడుకి చెందిన భీమన్న ఆదిలక్ష్మికి ఎగ్ కార్ట్ మంజూరైంది. కాగా, మండపేటలోని ఎమ్మెల్యే వేగుళ్ల క్యాంపు కార్యాలయంలో ఎగ్ కార్ట్‌ను ఆదిలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కోలుపోటి సత్యనారాయణమూర్తి, డీపీఎం ఆదియ్య, ఏపీఎం విష్ణుమూర్తి, మహిళా సంఘం అధ్యక్షురాలు చుక్కన రాణి కుమారి, కేఎల్‌వీ ప్రసాద్, వేణు పాల్గొన్నారు.

సూర్యచంద్ర హోమియో స్టోర్స్ వ్యవస్థాపకుడి మృతి



సలాది వరప్రసాదరావు (ఫైల్)

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలో సుమారు 50 ఏళ్ల అనుభవం గల సూర్యచంద్ర హోమియో స్టోర్స్ వ్యవస్థాపకుడు సలాది వరప్రసాదరావు (72) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. హోమియో వైద్యుడైన ఆయన బంధువు ప్రోత్సాహంతో సుమారు 50 ఏళ్ల క్రితం పట్టణంలోని రథం సెంటర్‌లో హోమియో స్టోర్స్ స్థాపించారు. సుదీర్ఘ అనుభవంతో ప్రజలకు వైద్యం చేస్తూ పేరు పొందారు. తర్వాత కాలంలో మండపేట కలువ పువ్వు సెంటర్‌తో పాటు రాష్ట్రంలో పలు చోట్ల హోమియో స్టోర్ బ్రాంచ్‌లను విస్తరించారు. ఆయన మృతికి పట్టణానికి చెందిన హోమియో వైద్యులు, సంగమం సాంస్కృతిక వేదిక నిర్వాహకులు చల్లా రవికుమార్, మెహర్ ప్రసన్న సంతాపం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ రహిత ఉత్సవం మేలు

కపిలేశ్వరపురం (మండపేట): గణపతి నవరాత్ర ఉత్సవాలను ప్లాస్టిక్ రహితంగా నిర్వహించుకోవడం ద్వారా మానవాళికి ప్రయోజనకరంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటనలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నవరాత్ర శిబిరాల్లో ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను వాడకుండా జాగ్రత్త పడాలని పట్టణ ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ బదులు క్లాత్ బ్యానర్లు, బ్యాగుల వినియోగం పర్యావరణ హితంగా ఉంటుందన్నారు. నిబంధనలను మీరి ప్లాస్టిక్ సరకులను వినియోగిస్తే రూ.2 వేలు వరకూ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

రామచంద్రపురంలో ప్రొటోకాల్ వివాదం

రామచంద్రపురం: పట్టణంలో సోమవారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రెండు పాలక వర్గాల ప్రమాణ స్వీకారం కార్యక్రమాలు నిర్వహించారు. ఒకటి ప్రతిష్ఠాత్మకమైన కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పాలకవర్గం కాగా, రెండోది స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయ పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం. కాగా పట్టణ ప్రథమ పౌరులు అయిన మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి పేరు ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రికల్లో వేయకపోవడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

పాఠశాలకు ఫ్యాన్లు, లైట్లు బహూకరణ

రాయవరం: స్థానిక రాయవరం రాజరాజేశ్వరి కాలనీలో ప్రాథమిక పాఠశాలకు దాత నూలు సత్యనారాయణ నాలుగు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేశారు. పాఠశాల ఆవరణలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రూ.15 వేలు విలువైన ఫ్యాన్లు, లైట్లు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, కొవ్వూరి నాగిరెడ్డి తదితరులు దాతను అభినందించారు.

రేవులో రాకపోకలు యథాతథం

సఖినేటిపల్లి: మండలంలో సఖినేటిపల్లి, నర్సాపురం రేవులో సోమవారం పంటు రాకపోకలు యథాతథంగా ప్రారంభమయ్యాయి. ఇటీవల వరద ఉధృతి నేపథ్యంలో మూడు రోజులుగా అధికారులు రాకపోకలను నిలుపుదల చేశారు. రేవులో వరద గోదావరి శాంతించడంతో రాకపోకలు తిరిగి మొదలయ్యాయి.

పిచికారీతో జాగ్రత్తన్నా!

- పురుగు మందుల పిచికారీలో శాస్త్రీయ పద్ధతులు
- పరికరాల పరిశుభ్రంపై అవగాహన అవసరం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



చేనుకు పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

కపిలేశ్వరపురం: దేశానికి వెన్నుముక రైతు. అలాంటి రైతులు పంటలు పండించే క్రమంలో పురుగుమందులు, ఎరువులు పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోక అనారోగ్యం పాలవుతున్నారు. రైతు ఆరోగ్యంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అందువల్ల రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పటిస్తూ సాగు చేయడం ఉత్తమం.

సాగు సజావుగా సాగాలంటే శాస్త్రీయ పద్ధతులను అవలంభించాలి. వ్యవసాయ సాగు అనగానే అధిక దిగుబడులు, లాభాలపైనే కాకుండా సాగు చేసే రైతు ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలి. అందుకోసం వ్యవసాయ సాగు పద్ధతుల్లో మెళుకువలు, జాగ్రత్తలను సైతం పాటించాలి. నారుమడి వేయడం నుంచి పంట చేతికొచ్చే వరకూ జాగ్రత్తలపై అవగాహనతో మెలగాలి. ముఖ్యంగా చేనుకు ఎరువులు పిచికారీ చేసేటప్పుడు, పురుగు మందులు స్ప్రే చేసేటప్పుడు రైతు ఆరోగ్య జాగ్రత్తలు విధిగా తీసుకోవాలి. అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు, పురుగుమందులను స్ప్రే చేయాలి. మందును పిచికారి చేసేటప్పుడు రైతు శారీరకంగా, మానసికంగా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా మందులను పిచికారీ చేసే యంత్రాల వినియోగంలో అవగాహన అవసరం. పురుగు మందులను పిచికారీ చేసేటప్పుడు వ్యవసాయ శాఖాధికారులు, వైద్యుల సూచనలను పాటించాల్సిందే. రాయవరం మండలం వ్యవసాయాధికారి రమేష్ కుమార్ చేస్తున్న సూచనలివే.

రెండు నియోజకవర్గాల్లో సాగు ఇలా...

రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 44,365 మంది రైతులు 53,821 ఎకరాల్లో ఖరీఫ్ వరిని సాగు చేసున్నారు. మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 37,622 మంది రైతులు 46,309 ఎకరాల్లో వరిని సాగు చేసున్నారు. మొత్తం రెండు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో 81,987 మంది రైతులు 1,00,130 ఎకరాల్లో వరిని సాగు చేసున్నారు.



కేవీఎన్ రమేష్‌కుమార్

అస్వస్థతకు గురైతే..

పురుగుల మందు ప్రభావంతో అస్వస్థతకు గురైన వ్యక్తికి వెంటనే ప్రథమ చికిత్స చేయాలి. అందులో భాగంగా రోగి శరీరానికి ఉష్ణోగ్రత అధికంగా ఉంటే తడిగుడ్డతో శరీరాన్ని తుడవాలి. ఉష్ణోగ్రత మరీ తక్కువగా ఉంటే దుప్పటి కప్పాలి. నోటిలో వేలు పెట్టి వాంతి అయ్యేటట్టు చేయాలి. ప్రథమ చికిత్స చేసిన అనంతరం రోగిని వైద్యుని దగ్గరకు తీసుకెళ్లాలి. చేనుకు వాడిన మందు తాలూకు వివరాలు కచ్చితంగా వైద్యునికి తెలియజేయాలి.

స్ప్రేయర్లను భద్రపర్చే విధానం

స్ప్రేయర్లను ఒక్కో దశలో మాత్రమే వినియోగిస్తారు. పని అయిన తర్వాత పక్కన పడేస్తారు. ఇలా చేయడం ద్వారా అవి పాడయ్యే ఇబ్బందులున్నాయి. అందుకోసం ఈ విషయాలు గుర్తుపెట్టుకోవాలి.

- ఆధునికత నేపథ్యంలో బ్యాటరీ రీచార్జిబుల్ స్ప్రేయర్లు ఉనికిలోకి వచ్చాయి. పవర్ స్ప్రేయర్లతో పోలిస్తే బ్యాటరీ రీచార్జిబుల్ స్ప్రేయర్లు బరువు తక్కువ ఉంటుంది. పైరుపై మందు స్పీడ్ తగు మోతాదులో చిమ్ముతుంది. వీటిని భద్రపర్చేందుకు నీటిని స్ప్రే చేస్తూ శుభ్రం చేయాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి కనీసం ఒక గంటపాటు ఛార్జింగ్ పెడుతుండాలి. దీని ద్వారా బ్యాటరీ సామర్థ్యం దెబ్బతినకుండా ఉంటుంది.
- పవర్ స్ప్రేయర్ టర్బోరేటర్, ట్యాంకులోనూ పెట్రోల్ లేకుండా చూసుకోవాలి. పిచికారీ ప్రక్రియ పూర్తికాగానే మంచినీటితో శుభ్రం చేయాలి. ప్లగ్‌ను తీసి పెట్రోల్‌తో శుభ్రపర్చి, పిస్టన్‌పై కాస్త ఇంజిన్ ఆయిల్‌ను వేసి బిగించాలి.
- తైవాన్ స్ప్రేయర్‌లో ఐదారు లీటర్ల నీరు పోసి నాజిల్ ద్వారా బయటకు స్ప్రే చేయాలి. దీని వల్ల స్ప్రేయర్‌లో చిక్కుకున్న మలినాలు బయటకు వచ్చేస్తాయి.
- హ్యాండ్ స్ప్రేయర్ల విషయంలో ఇత్తడి స్ప్రేయర్ గొట్టం తీసి అందులో కాస్త ఇంజిన్ ఆయిల్ పోసి బిగించాలి. దీని వల్ల తుప్పు పట్టకుండా ఉంటుంది. హైటెక్ స్ప్రేయర్లలో బుష్‌లు, రాడ్లుకు ఇంజిన్ ఆయిల్ పూయాలి.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ప్రసన్నకుమార్

కె.గంగవరం: ప్లాస్టిక్‌ను వాడడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లి మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సలాది ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను గురించి అవగాహన సమావేశం నిర్వహించారు. మండలానికి చెందిన సలాది ప్రస్నకుమార్ ముంబైలో ఉద్యోగం చేసుకుంటూ ప్రతి ఏటా పర్యావరణ పరిరక్షణపై తన బాధ్యతను మరువకుండా అవగాహన సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పౌరుడిగా పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, ముఖ్యంగా విద్యార్థులు ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకం మానేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ఇప్పటి నుంచి ప్లాస్టిక్‌ను వాడమని ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌యం వెంకటేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి వీఎస్ సుబ్రహ్మణ్యం, నరజాడ హెచ్‌ఎం ప్రేమకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా సూర్యప్రకాశ్ పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేసి సూర్యప్రకాశ్‌కు తినిపిస్తున్న కాజులూరు మండల నాయకులు, కార్యకర్తలు



రామచంద్రపురం పట్టణంలో కేక్ కట్ చేస్తున్న సూర్యప్రకాశ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు

కాజులూరు: రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండల గ్రామాలకు చెందిన పలువురు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, రామచంద్రపురం పార్టీ కార్యాలయానికి తరలివెళ్లి సూర్యప్రకాశ్‌తో కేక్ కట్ చేయించి కార్యకర్తలకు పంచిపెట్టారు. పలువురు నాయకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

పట్టణంలో...

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం రామచంద్రపురం పట్టణం, రామచంద్రపురం రూరల్, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు పూలదండలు, పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ద్రాక్షారామలో ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ ఆధ్వర్యంలో బోసుబొమ్మ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం



ప్రతిమలను పంపిణీ చేస్తున్న విద్యార్థులు



వినాయక మట్టి ప్రతిమలతో విద్యార్థినులు

కె.గంగవరం: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలనే పూజించాలని సత్యవాడ గ్రామానికి చెందిన పర్యావరణ పరిరక్షుడు సలాది ప్రసన్నకుమార్ అన్నారు. ఆయన సుమారు 500 మట్టి విగ్రహాలను తయారు చేసి విద్యార్థులతో ఇంటింటికి పంపిణీ చేశారు. ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీ చేసి మట్టి విగ్రహాల వల్ల జరిగే మేలును ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను గ్రామంలో పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

రామచంద్రపురం రూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి ఆధ్వర్యంలో సోమవారం తాము స్వయంగా తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలను పట్టణంలోని షాపుల వారికి ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీసీ అప్పారావు, అనిత పాల్గొన్నారు.

రాయవరం: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని పసలపూడిలో ఇంటింటా మట్టి వినాయక ప్రతిమలను దాత ద్వారంపూడి రామచంద్రారెడ్డి అందజేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కృత్రిమ రంగులతో తయారు చేసిన గణేష్ ప్రతిమల నిమజ్జనం పర్యావరణానికి హాని చేస్తుందని ప్రజలకు వివరించారు. పసలపూడిలో పర్యావరణ పరిరక్షణకై ప్రతిమలను అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి



ద్రాక్షారామలో ధర్నా చేస్తున్న అఖిల పక్ష జేఏసీ నాయకులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలంతో పాటు రామచంద్రపురం, కె.గంగవరం మండలాలు కూడా కాకినాడ జిల్లాలోనే కలపాలని కోరుతూ అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఆధ్వర్యంలో నియోజకవర్గ కూడలి ద్రాక్షారామ బోసు బొమ్మ సెంటర్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో కన్వీనర్ బి.సిద్ధూ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు, ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ మాధవరపు వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు శారద తదితరులు మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 60 కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే కాకినాడ జిల్లా అయితే కేవలం 25 కిలోమీటర్లు ప్రయాణిస్తే జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చని తెలిపారు.కోటిపల్లి రేవు నుంచి దగ్గరే అయినప్పటికీ వరదలు, తుఫానులు వంటివి వస్తే పూర్తిగా ప్రయాణం నిలిచిపోతుందన్నారు. మళ్లీ చుట్టూ తిరిగి యానం మీదుగా 60 కిలోమీటర్లు పైగా ప్రయాణించాల్సి వస్తుందని వివరించారు. అనంతరం కాకినాడ జిల్లాలో కలపాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వెంటపల్లి భీమశంకరం, శారద, వానపల్లి నాగరాజు, ఫాజిల్, కడలి రాంపండు, కరుపోతు నవీన్, రాజారెడ్డి, రిక్షా, ఆటో యూనియన్ నాయకులు, పలు పార్టీల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో విలీనం చేయాలంటూ తీర్మానం

కపిలేశ్వరపురం: మండలంలోని అద్దంకివారిలంకను కొత్తపేట మండలంలో విలీనం చేయాలని కోరుతూ గ్రామస్తులు పార్టీలకు అతీతంగా తీర్మాణం చేశారు. సర్పంచ్ నాతి గవరయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు విలీనంపై అభిప్రాయాలను తెలిపారు. ప్రస్తుతం కపిలేశ్వరపురంలో ఉండటం వల్ల మండల కేంద్రానికి దూరాభారంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారన్నారు. కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు మండలాల్లోని గ్రామాల మీదుగా రావులపాలెం– జొన్నాడ గోదావరి బ్రిడ్జి మీదుగా కపిలేశ్వరపురం వెళ్లాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకుడు కొండేటి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

సహకార సంఘాల తీర్మానాలతో ఆర్డీఓకు వినతి



ఆర్డీఓ అఖిలకు వినతిపత్రం అందజేస్తున్న పీఏసీఎస్‌ల ప్రతినిధులు, ఉద్యోగులు

రామచంద్రపురం: నియోజకవర్గంలోని రామచంద్రపురం, కె.గంగవరం మండలాలను కూడా కాజులూరు మండలంతో పాటు కాకినాడ జిల్లాలో కలపాలని రెండు మండలాల పీఏసీఎస్‌లలో తీర్మానాలు ఆమోదించి వాటిని జిల్లా జేసీ నిశాంతి, రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిలకు సోమవారం ఆయా సంఘాల అధ్యక్షుడు, సభ్యులు, ఉద్యోగులు అందజేశారు. కాకినాడ జిల్లాలో కలపడం ద్వారా ప్రజలకు సౌలభ్యం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ల అధ్యక్షుడు ముప్పనపల్లి గణేష్, మేడిశెట్టి రాధాకృష్ణ, మేకా జానకిరామయ్య, పెంకే గోవిందరాజు, నేమాని సత్యనారాయణ, గాలి వెంకటేష్మకరజ్యోతి, గెడ్డం పల్లపురావు, పత్తి సూర్యనారాయణ, నూనె లక్ష్మయ్య, కొమ్మిరెడ్డి కోదండరాముడు, కార్య నిర్వాహణాధికారులు పెంకే సత్యనారాయణ, గొడవర్తి సూర్యనారాయణచౌదరి, అద్దంకి ధనరాజు, కొండాయపాలెపు వీరబాబు, కాకినాడ మహాలక్ష్మి, పిల్లి శ్రీనివాసరావు, సలాది శ్రీరాములు, గుత్తుల కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



మరుగుదొడ్లను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభిస్తున్న దాత సత్యనారాయణ, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు

కె.గంగవరం: విద్యార్థి దశ నుంచే విద్యతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను కూడా అలవాటు చేసుకోవాలని కె.గంగవరం సొసైటీ అధ్యక్షుడు, దాత నేమాని సత్యనారాయణ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న బాలుర మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించి నిర్మించారు. నిర్మాణం పూర్తి అయిన మరుగుదొడ్లను సోమవారం ఆయన హెచ్‌ఎం వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఫ్లోరింగ్‌తో పాటు టైల్స్, వాటర్ లైనింగ్, డోర్లు, వాష్‌రూమ్‌కు వెళ్లడానికి అవసరమైన రహదారి నిర్మాణం చేసి అందుబాటులోనికి తెచ్చిన దాత సత్యనారాయణను విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు పితాని శ్రీనివాసు, చాగంటి రామలక్ష్మి, శ్రీధర్, కె. శ్రీనివాసు, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ ప్రారంభం



రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలోని శిక్షణలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

రామచంద్రపురం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో జిల్లా స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్ సోమవారం ప్రారంభించారు. జిల్లా స్థాయిలో అమలాపురంతోపాటు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల్లోని ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలకు సెప్టెంబరు 9వ తేదీ వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. 201 మందికి 5 బ్యాచ్‌లుగా ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. పట్టణాలు, గ్రామాల్లో 18 సంవత్సరాల పైబడిన పురుషుల్లో నోటి క్యాన్సర్, స్త్రీలలో నోటి, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారి వివరాలు సేకరించి వైద్య అధికారులకు నివేదిస్తారన్నారు.

తద్వారా క్యాన్సర్‌ను త్వరగా గుర్తించి చికిత్సలు అందించడం వల్ల మరణాల రేటును తగ్గించవచ్చని వివరించారు. డాక్టర్ లక్ష్మి, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రత్న కుమారి, డాక్టర్ ఇందిర పాల్గొని శిక్షణ అందించారు. కార్యక్రమంలో డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మేఘన పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు ఇంటింటా సర్వే

రాయవరం: సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ జ్వరాలను గుర్తించేందుకు మండలంలోని చెల్లూరులో ఇంటింటా సర్వే సోమవారం నిర్వహించారు. మండపేట సబ్ యూనిట్ అధికారి పీడీ బిషప్, మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారి మణికంఠ పర్యవేక్షణలో స్థానిక చింతలతోటలో అనుమానితుల రక్తమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. రుబ్బురోలు, ఫ్రిజ్ వెనక డిస్క్‌లో నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, గుంతల్లో, ఇంటి పరిసరాల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలని ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. దోమలార్వా ఏర్పడే దుష్పరిమాణాలను వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ల ఏర్పాటు

ఆలమూరు: మండలంలోని ఆరు చోట్ల ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఏ రాజు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆధార్ సెంటర్లు ఏర్పాటులో కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. అందులో భాగంగా ఆధార్ సేవలపై శిక్షణ పొందిన డీఏలు ఉన్న ఆరు చోట్ల ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దీంతో మడికి–2, చెముడులంక–1, జొన్నాడ–2, ఆలమూరు–2, నర్శిపూడి, సంధిపూడిలో అందుబాటులోకి వచ్చిన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా

- ఆర్డీఓ శ్రీకర్
- పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అమలుపై డివిజన్ కమిటీ సమీక్ష



కొత్తపేటలో సమీక్షిస్తున్న ఆర్డీఓ శ్రీకర్

కొత్తపేట: గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలని స్థానిక ఆర్డీఓ పీ శ్రీకర్ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ(పీసీపీఎన్‌డీటీ) చట్టం అమలు డివిజన్ కమిటీ సభ్యులకు సూచించారు. సోమవారం డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీఓ, చట్టం అమలు కమిటీ చైర్మన్ శ్రీకర్ అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు, చిన్న వయసులో గర్భధారణ తదితర అంశాలపై సమీక్షించారు. ఆర్డీఓ మాట్లాడుతూ లింగ వివక్షతను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశమన్నారు. పుట్టబోయే బిడ్డ ఆడ అయినా, మగ అయినా ఒకటే అనే భావన భార్యాభర్తల్లో కలగాలన్నారు. ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్స్ గర్భస్థ లింగ నిర్ధారణ కోసం ఉపయోగిస్తే పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం నేరమని, చట్టాన్ని ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేస్తారని హెచ్చరించాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సెక్రటరీ డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎం.సుమలత, సభ్యులు సీడీపీఓ ఏ గజలక్ష్మి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ అన్నపూర్ణ, ఎస్సై జీ సురేంద్ర, వైద్య సిబ్బంది కాశిన శేషు తదితరులు పాల్గొన్నారు.